రేవంత్ రెడ్డికి నోటీసులు

- మే1న విచారణకు హాజరుకావాలన్న ఢిల్లీ పోలీసులు

అక్షర దర్బార్, హైదరాబాద్ : కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మార్ఫింగ్ వీడియో కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. మే1 విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం గాంధీభవన్ లో నోటీసులు అందించారు. అమిత్ షా పేరిట వైరలవుతున్న కొన్ని నకిలీ వీడియోలపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ కేసు విచారణలో భాగంగా పలువురు తెలంగాణ కాంగ్రెస్ నేతలు, సోషల్ మీడియా విభాగానికి ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అస్లాం తస్మీన్, పార్టీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మన్నె సతీశ్, ఆ పార్టీకి చెందిన నవీన్, శివకుమార్‌లకు నోటీసులు ఇచ్చారు. మార్ఫింగ్ వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేశారని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ నోటీసులపై వివరణ ఇస్తామని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తెలిపారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అమిత్ షా ఈ నెల 23న తెలంగాణలో జరిగిన విజయ సంకల్ప సభలో పాల్గొన్నారు. అక్కడ మాట్లాడుతూ, బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లీం రిజర్వేషన్లను రద్దు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చెందిన ఆ హక్కులను తిరిగి వారికే ఇచ్చేస్తామని వ్యాఖ్యానించారు. దీన్ని కొంతమంది వక్రీకరించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్‌ను రద్దు చేస్తామని అమిత్ షా చెప్పినట్లు వీడియో ఎడిట్ చేసి వైరల్ చేశారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ కేసులో ఇప్పటికే రోమిత్ సింగ్ ను అరెస్టు చేశారు.

కాంగ్రెస్ కు మరో షాక్

ఇండోర్ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ..

బీజేపీలో చేరిక

అక్షర దర్బార్, ఇండోర్ : కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మధ్యప్రదేశ్ లో కాంగ్రెస్ అభ్యర్థి విత్ డ్రా చేసుకొని బీజేపీలో చేరారు. సూరత్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలేష్ కుంభాని నామినేషన్ తిరస్కరణకు గురికావడం, మిగితా స్వతంత్రులు కూడా విత్ డ్రా చేసుకోవడం చకచకా జరిగిపోయాయి. దీంతో బీజేపీ నుంచి నామినేషన్ వేసిన ముఖేష్ దలాల్ ఏకగ్రీవమైన విషయం తెలిసిందే. ఈ సంఘటన మరిచిపోకముందు మధ్యప్రదేశ్ రాష్టంలోని ఇండోర్ లోకసభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి అక్షయ్ కాంతి బామ్ చివరి నిమిషంలో సోమవారం నామినేషన్ విత్ డ్రా చేసుకోని ఆ వెంటనే బీజేపీలో చేరారు. సార్వత్రిక ఎన్నికల వేళ విత్ డ్రాలు చేసుకోవడానికి చివరి రోజు ఈ సంఘటన కాంగ్రెస్ కు పెద్ద దెబ్బ. దీంతో ఈ ఎన్నికల్లో రెండు స్థానాలు బీజేపీ ఖాతాలో పడ్డట్టే. మధ్యప్రదేశ్‌లోని అతిపెద్ద లోకసభ నియోజకవర్గాన్ని రికార్డ్ మెజారిటీతో గెలుచుకోవాలని బిజెపి నాయకులు భావిస్తున్నారు.

దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ ..

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేరు..

హామీలు ఇవ్వకుండా ప్రజల్లో తిరగలేరు..

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..

ఒక కార్యకర్తగా మీతో వెన్నంటే ఉంటా....

డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్.

అక్షర దర్బార్, పరకాల : రాష్ట్రం కాంగ్రెస్ పరిస్థితి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, హామీలు నెరవేర్చకుండా పార్లమెంట్ ఎన్నికల్లో తిరగలేని పరిస్థితి నెలకొన్నదని, ఆ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం తప్పదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో వార్డుల వారీగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్ కుమార్ కు మనమందరం మద్దతు తెలిపి మంచి మెజారిటీతో గెలిపించాలని, బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కలిసిపోయాయి. బిజెపి కి ఓటు వేస్తే కాంగ్రెస్ కు, కాంగ్రెస్ కు ఓటు వేస్తే బిజెపి కి వెళ్ళే పరిస్థితి ఉన్నది.రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉన్నప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని అందుకే మనమందరం బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి బిఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఒక కార్యకర్తగా మీతో వెన్నంటే ఉంటా....

డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్.

వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమ కారులకు అవకాశాలు కల్పించే ఏకైక పార్టీ బి ఆర్ ఎస్ పార్టీ అని 2001 నుండి తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ వెన్నంటే ఉన్నాను. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఎన్నో కేసులు పెట్టిన స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా పని చేసాను. వరంగల్ పార్లమెంట్ నియోజక వర్గ బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిగా నిండు మనసుతో దీవించి నన్ను గెలిపించండి అని కోరారు. నేను గెలిచాక ఎంపీగా కాదు మీతో పాటు ఒక కార్యకర్తగా వెన్నంటే ఉంటానని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు పరచడంలో పూర్తిగా విఫలం అయ్యిందని కరెంట్ లేదు. రైతులకు సాగు నీరు, తాగు నీరు లేదని రైతు వ్యతిరేక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రము పట్ల వివక్ష చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కు నీరాజనం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్రకు ఆయా ప్రాంతాల్లో అభిమానులు ఘనస్వాగతం పలికారు. రోడ్డు పక్కన గల చిన్న హోటల్ లో పకోడి, మిర్చిల రుచి చూసారు. అక్కడి వారితో సరదాగా మాట్లాడి సందడి చేశారు. గులాబీ బాస్ ను చూడటానికి పెద్ద సంఖ్యలో ప్రజలు చేరుకున్నారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మిర్యాలగూడలో బస్సు యాత్రను ప్రారంభించిన విషయం తెలిసిందే.

కార్పొరేటర్ అరెస్టు

కులం పేరుతో దూషించిన కేసులో

మరుపల్లి రవి కోర్టులో హాజరు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః భూ వివాదంలో జోక్యం చేసుకుని, కులం పేరుతో దూషించిన కేసులో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్ కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఉర్సు ప్రాంతానికి చెందిన పసునూరి అరవింద్ అనే వ్యక్తికి కరీమాబాద్, కుమ్మరి వాడలో 212 చ. గజాల ప్లాట్ ఉంది. వారసత్వంగా ఈ ఆస్తి సంక్రమించింది. ఇదే ఆస్తిని ఇద్దరు వ్యక్తులు కొనుగోలు చేయడానికి అగ్రిమెంట్ చేసుకున్నారు. కానీ పూర్తి మొత్తం చెల్లించకపోవడంతో రిజిస్ట్రేషన్ కాలేదు. అగ్రిమెంట్ కుదుర్చుకున్నామనే కారణంగా ఆస్తిని వివాదం చేస్తూ తమదే ఆస్తి అన్నట్లు అగ్రిమెంట్ చేసుకున్న వారు వ్యవహరించారు. వీరికి సపోర్టుగా కార్పొరేటర్ మరుపల్లి రవి నిలిచాడు. కొద్ది రోజుల క్రితం అరవింద్ ప్లాట్ వద్ద ఉండగా కార్పొరేటర్ అండతో అగ్రిమెంట్ హోల్డర్స్ భయభ్రాంతులకు గురిచేయడం, కులం పేరుతో దూషించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏసీపీ నందిరాం నాయక్ విచారణ చేసి కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రేపు 'పది' ఫలితాలు

అక్షర దర్బార్, హైదరాబాద్ : పదో తరగతి విద్యార్థులకు గుడ్ న్యూస్. ఫలితాలు విడుదల చేయడానికి ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఎన్నికల అధికారుల అనుమతి తీసుకొని మంగళవారం ఉదయం11గంటలకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేషం పదో తరగతి ఫలితాలను విడుదల చేయనున్నారు. తెలంగాణలో పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 5,08,385 మంది విద్యార్థులు ఎగ్జామ్స్ రాశారు. ఏప్రిల్ 20 వరకు మూల్యాంకనం పూర్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల ఎలక్షన్ కమిషన్ నుంచి అనుమతి తీసుకుని ఫలితాలను వెల్లడిస్తున్నారు. పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పీఈఎన్) నెంబర్ ను మెమోపై ముద్రించనున్నారు. పెన్ నెంబర్ విధానాన్ని ఈ సంవత్సరం నుంచే అమలు చేయనున్నారు. మెమోలపై 11 అంకెలతో కూడిన పెన్ నంబర్‌ను ముద్రించనున్నారు.